# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 30-04-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **విశాఖపట్నం జిల్లా సింహాచలం ఆలయ ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.**

**2.** **సింహాచలం ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణ చేపట్టాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు.**

**3.** **ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు.**

**4.** **రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో 13 వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టినట్లు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి పేర్కొన్నారు.**

**5.** **ప్రముఖ తెలుగు విప్లవ కవి, రచయిత శ్రీశ్రీగా సుపరిచితులైన శ్రీరంగం శ్రీనివాసరావు జయంతి ఈరోజు.**

==========================

విశాఖపట్నం జిల్లా సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద జరిగిన ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ప్రధానమంత్రి జాతీయ సహాయనిధి నుంచి పరిహారం ప్రకటించారు. మృతుల కుటుంబాలకు 2 లక్షల రూపాయల చొప్పున, గాయపడిన వారికి 50 వేల రూపాయల చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. గోడ కూలి ఏడుగురు భక్తులు మృతి చెందడంపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ విచారం వ్యక్తం చేశారు.

--------------------------

కాగా చందనోత్సవం సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి స్వామివారి నిజరూపాన్ని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులపై గోడ కూలడంతో ఏడుగురు మృతి చెందారు. నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మృతుల్లో ముగ్గురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారని అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంపై హోంశాఖ మంత్రి వి. అనిత పాత్రికేయులతో మాట్లాడుతూ,

వాయిస్ .. 24 సెకన్లు

---------------------------

సింహాచలం ఘటనపై మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శ్రవణ మాధ్యమం ద్వారా ఈ రోజు సమావేశాన్ని నిర్వహించారు. ప్రమాదం జరిగిన తీరు, క్షతగాత్రులకు అందుతున్న వైద్య సహాయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, మృతుల కుటుంబాలకు 25లక్షలు, గాయపడిన వారికి 3లక్షల చొప్పున పరిహారం అందజేయాలన్నారు. ఘటనపై ముగ్గురు సభ్యుల కమిటీతో విచారణ చేపట్టాలని సూచించారు. మరోవైపు గోడ కూలిన ప్రదేశంలో శిథిలాలను వెంటనే తొలిగించి భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. వేలాదిగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ రాష్ట్ర పర్యటనకు సంబంధించిన అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయని పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయం వెనుక ప్రధానమంత్రి సభకు జరిగే ఏర్పాట్లను ఆయన ఈరోజు పరిశీలించారు. అనంతరం మంత్రి పాత్రికేయులతో మాట్లాడుతూ సభకు వచ్చే ప్రజలకోసం ఆహారం, తాగునీరు వంటివి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ట్రాఫిక్ రద్దీ ఏర్పడకుండా రూట్ మ్యాప్ రూపొందించామని మంత్రి తెలియజేస్తూ..

వాయిస్ ..23 సెకన్లు

---------------------------

ఇలా ఉండగా.. రాజధాని పునర్నిర్మాణ పనుల శంకుస్థాపనకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అమరావతికి వస్తున్న నేపథ్యంలో మే 2వ తేదీ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా తెలిపారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి పర్యటన, బహిరంగ సభ కార్యక్రమం కోసం విజయవాడ, గుంటూరు మధ్య ఉండే జాతీయ, రాష్ట్ర రహదారులపై ట్రాఫిక్ రద్దీని నియంత్రించేందుకు వీలుగా ఈ మళ్లింపులు చేపట్టామని తెలిపారు. వాహనదారులు, ప్రయాణికులు వీటిని గమనించి సహకరించాలని కోరారు.

---------------------------

రాష్ట్రంలోని గిరిజన ప్రాంతాల్లో 13 వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేట్టినట్లు గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న ఆమె పాత్రికేయులతో మాట్లాడుతూ, డోలీ మోతలు లేకుండా చేసేందుకు వెయ్యి కోట్ల రూపాయలతో మారుమూల గిరిజన గ్రామాలకు రోడ్లు వేస్తున్నామని చెప్పారు. గిరిశిఖర గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తున్నామని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ .. 30 సెకన్లు

---------------------------

ప్రజలకు ఆహార భద్రత కల్పించడంలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కీలక పాత్ర పోషిస్తోందని వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. గుంటూరుజిల్లా లాంఫాంలో నిర్వహించిన వ్యవసాయ విశ్వవిద్యాలయం వజ్రోత్సవాల కార్యక్రమంలో ఆయన నిన్న ప్రసంగించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వ్యవసాయంలో కృత్రిమ మేధ వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సేంద్రియ సాగు, ప్రకృతి వ్యవసాయాన్ని జోడించి రైతులకు మేలు జరిగేలా పరిశోధనలు చేయాలని సూచించారు. అరవై ఏళ్ల కాలంలో అనేక రకాల వరి వంగడాలను అందించిన ఘనత ఈ విశ్వవిద్యాలయానికి ఉందని మంత్రి పేర్కొన్నారు.

-----------------------------

పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసిన విద్యార్థులు బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం పొందేందుకు మే నెల 6న ఏపీఈసెట్-2025 పరీక్షలు నిర్వహించనున్నట్లు సెట్ ఛైర్మన్, సుదర్శనరావు తెలిపారు. అనంతపురంలోని జవహర్ లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ, 14 విభాగాలకు ఈ పరీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు.రాష్ట్రంలో 109 పరీక్ష కేంద్రాలు, హైదరాబాద్‌లో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేశామని ఆయన తెలియజేస్తూ,

వాయిస్ .. 31 సెకన్లు

-----------------------------

ప్రముఖ తెలుగు విప్లవ కవి, రచయిత శ్రీశ్రీగా సుపరిచితులైన శ్రీరంగం శ్రీనివాసరావు జయంతి ఈరోజు. తెలుగు సాహిత్యపు దశ-దిశను మార్చిన "మహా ప్రస్థానం", "జగన్నాథరథ చక్రాలు", "గర్జించు రష్యా" వంటి కవితా సంకలనాలు రచించిన శ్రీశ్రీ 1910 ఏప్రిల్ 30వ తేదీన విశాఖ జిల్లా పాండ్రంగిలో జన్మించారు. ఆయన ఆకాశవాణిలోనూ పనిచేశారు. శ్రీశ్రీ కవిగానే కాకుండా మాటలు, పాటల రచయితగానూ ప్రసిద్ధి పొందారు. అల్లూరి సీతారామరాజు చిత్రంలోని 'తెలుగు వీర లేవరా' గీతానికి శ్రీశ్రీ జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్నారు. 19వ శతాబ్దం నాదంటూ ఎలుగెత్తి చాటిన మహాకవి శ్రీశ్రీ 1983 జూన్ 15న అస్తమించారు.

-----------------------------

సర్వమానవ సమానత్వాన్ని బోధించిన అభ్యుదయ వాది బసవేశ్వరుడని పార్వతీపురం మన్యం జిల్లా సంయుక్త కలెక్టర్ ఎస్.ఎస్. శోభిక అన్నారు. పార్వతీపురంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈరోజు బసవేశ్వరుని జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా బసవేశ్వర చిత్ర పటానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వర్ణవ్యవస్థలేని సమాజంకోసం బసవేశ్వరులు కృషి చేశారని అన్నారు.

-----------------------------

గుంటూరు జిల్లా మంగళగిరిలో రేపు నిర్వహించే కార్మిక దినోత్సవం-మేడే కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి కె. పవన్‌కల్యాణ్ పాల్గొననున్నారు. మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం శ్రామికులను ఒకే వేదికపైకి తెచ్చేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం జిల్లాకు పది మంది చొప్పున శ్రామికులను ఆహ్వానిస్తున్నామని అధికారులు తెలిపారు.

====================